## ఐపీఎల్ ముచ్చట్లు

# కోహ్లీ.. కోహ్లీ..! ఆ ఒక్కడి మీదే ఇంకెన్నాళ్లు..?

'కేజీఎఫ్'.. ఐపీఎల్‌లో అత్యంత జనాదరణ కలిగిన రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) తమ అభిమాన ఆటగాళ్లైన విరాట్ కోహ్లీ, గ్లెన్ మ్యాక్స్‌వెల్, ఫాఫ్ డుప్లెసిస్‌లకు పెట్టుకున్న పేరు అది. ఈ ముగ్గురూ విడివిడిగా ఒక జట్టులో ఉంటేనే ప్రత్యర్థులకు ప్రమాదం అంటే.. కలిసి ఆడితే ఇంకేమైనా ఉందా..? ప్రపంచంలోని ఎంతటి మెరుగైన బౌలింగ్ టీమ్ అయినా ఈ బ్యాటింగ్ త్రయాన్ని ఢీకొట్టడానికి ఒకటికి రెండుసార్లు ఆలోచించుకోవాలి. గత సీజన్‌లో ఈ ముగ్గురూ ఒకరిని మించి ఒకరు పరుగుల వరద పారించారు. వీళ్లకు తోడుగా మిడిలార్డర్‌లో రజత్ పాటిదార్ సైతం వచ్చిన అవకాశాన్ని రెండు చేతులా అందుకున్నాడు. ఈ సీజన్‌కు ముందు రిటెన్షన్ ప్రక్రియలో భాగంగా ఆసీస్ ఆల్‌రౌండర్ కామెరూన్ గ్రీన్‌ను రూ.17.50 కోట్లు వెచ్చించి దక్కించుకున్నా అతడూ నాలుగు మ్యాచ్‌లలో తన మార్కును చూపలేదు. ఈ సీజన్‌లో కోహ్లీ తప్ప మిగిలిన ఆర్సీబీ టాపార్డర్ బ్యాటర్లంతా దారుణంగా విఫలమవుతున్నారు.



2024 సీజన్‌లో ఇప్పటిదాకా ఆర్సీబీ 4 మ్యాచ్‌లు ఆడగా టాపార్డర్‌లో ఒక్క కోహ్లీ తప్ప మిగిలిన బెంగళూరు బ్యాటర్లు అట్టర్ ఫ్లాఫ్ అవుతున్నారు. 2024లో 4 మ్యాచ్‌లలో కోహ్లీ.. 203 పరుగులు చేయగా మ్యాక్స్‌వెల్ (31), డుప్లెసిస్ (65), గ్రీన్ (63) కలిసి చేసింది 159 పరుగులే. కోహ్లీ మీద ఆర్సీబీ పరిమితికి మించి ఆధారపడుతుందని చెప్పడానికి ఇదే నిదర్శనం. 2008 నుంచి ఆర్సీబీకి ఆడుతున్న కోహ్లీ.. 2010 తర్వాత ఆడిన ప్రతి సీజన్‌లోనూ 300+ పరుగులు చేస్తూ ఆర్సీబీ బ్యాటింగ్‌కు వెన్నెముకలా నిలుస్తున్నాడు. ఆర్సీబీ టాపార్డర్ వైఫల్యంపై కేకేఆర్‌తో మ్యాచ్‌లో గవాస్కర్ మాట్లాడుతూ.. 'ఇంకెంతకాలం ఆర్సీబీ కోహ్లీ మీద ఆధారపడుతుంది..? కోహ్లీ ఒక్కడే జట్టును ఎంతకాలమని లాక్కొని రాగలడు. ఎవరో ఒకరు అతడికి సహకరించాలి..' అని వ్యాఖ్యానించాడు. చెన్నై మ్యాచ్‌లో ఫర్వాలేదనిపించినా పంజాబ్, కోల్‌కతాతో కోహ్లీ అర్ధ సెంచరీలతో ఆర్సీబీ గట్టెక్కింది. కానీ మంగళవారం లక్నోతో మ్యాచ్‌లో కోహ్లీ ఔట్ కాగానే డుప్లెసిస్, మ్యాక్స్‌వెల్, గ్రీన్ పెవిలియన్‌కు క్యూ కట్టారు.

2023 సీజన్‌లో డుప్లెసిస్, మ్యాక్సీ, పాటిదార్‌లు దుమ్మురేపినోళ్లే. డుప్లెసిస్ (14 మ్యాచ్‌లలో 730), మ్యాక్సీ (14 మ్యాచ్‌లలో 400), గ్రీన్ (ముంబై తరఫున ఆడుతూ 16 మ్యాచ్‌లలో 452) మైదానంలోకి వస్తే మినిమం గ్యారెంటీ ఎంటర్‌టైన్‌మెంట్ ఇచ్చారు. కానీ తాజా సీజన్‌లో ఈ ముగ్గురూ తమ ఆటతో బోర్ కొట్టిస్తున్నారు.

## లక్ష్మికి స్వర్ణం



రవీంద్రభారతి, ఏప్రిల్ 2: లాస్‌వేగాస్(అమెరికా) వేదికగా జరిగిన అమెరికా ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్‌లో ఏపీకి చెందిన నర్రా లక్ష్మిస్వరాజ్యం స్వర్ణ పతకంతో మెరిసింది. మహిళల 50 ఏండ్ల వయసు కటా నాంచాక్ విభాగంలో అద్భుత ప్రదర్శన కనబరిచింది. మరోవైపు పురుషుల కేటగిరీలో రవి స్వర్ణం సొంతం చేసుకున్నాడు. ఈ పోటీలలో 29 దేశాల నుంచి రెండు వేల మంది ప్లేయర్లు పాల్గొన్నట్లు లక్ష్మి పేర్కొంది. రుద్రమదేవి సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీ ద్వారా వివిధ రంగాలకు చెందిన మహిళలకు, పోలీసు శాఖలో శిక్షణ అందిస్తున్నానని తెలిపింది.

### సూపర్‌జెయింట్స్ గెలుపు జోరు

# మయాంక్ మెరుపులు

### మూడు వికెట్లతో విజృంభణ
### ఆర్సీబీని వణికించిన లక్నో పేసర్
### మెరిసిన డికాక్, పూరన్

120 బంతుల్లో 182 పరుగులు. లక్నో సూపర్ కింగ్స్ (ఎల్ఎస్‌జీ) తో మ్యాచ్‌లో భాగంగా చిన్నస్వామి స్టేడియంలో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) లక్ష్యమది. కోహ్లీ, డుప్లెసిస్, మ్యాక్స్‌వెల్, గ్రీన్, పాటిదార్, కార్తీక్ వంటి హిట్టర్లు ఉన్న బెంగళూరులో ఏ ఇద్దరు నిలిచినా ఇదేం పెద్ద లక్ష్యం కాదు. కానీ ఐపీఎల్ నయా సంచలనం, తన వేగంతో ప్రపంచ క్రికెట్ అభిమానులను తన వైపునకు తిప్పుకున్న ఢిల్లీ కుర్రాడు మయాంక్ యాదవ్.. బెంగళూరు బ్యాటర్లను ఆటాడుకున్నాడు. అతడు వేసే స్పీడ్‌కు ఆర్సీబీ టాపార్డర్ దాసోహమంది. బాల్ టచ్ చేస్తే క్యాచ్.. మిస్ అయితే బౌల్డ్ అన్న రేంజ్‌లో అతడి విధ్వంసం సాగడంతో బెంగళూరు హోంగ్రౌండ్‌లో వరుసగా రెండో పరాభవాన్ని మూటగట్టుకుంది.



మయాంక్ యాదవ్ (3/14)

డికాక్ (81)

బెంగళూరు: ఐపీఎల్-17లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు సొంత మైదానం (చిన్నస్వామి)లో వరుసగా రెండో ఓటమిని మూటగట్టుకుంది. లక్నో యువ సంచలనం మయాంక్ యాదవ్ పేస్‌కు ఆర్సీబీ టాపార్డర్ పెవిలియన్‌కు క్యూ కట్టడంతో బెంగళూరుకు రెండో ఓటమి తప్పలేదు. బెంగళూరు వేదికగా జరిగిన మ్యాచ్‌లో టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన లక్నో.. నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 181 పరుగులు చేసింది. క్వింటన్ డికాక్ (56 బంతుల్లో 81, 8 ఫోర్లు, 5 సిక్సర్లు), నికోలస్ పూరన్ (21 బంతుల్లో 40 నాటౌట్, 1 ఫోర్, 5 సిక్సర్లు) మెరుపులు మెరిపించారు. అనంతరం ఛేదనలో ఆర్సీబీ.. 19.4 ఓవర్లలో 153 పరుగులకే ఆలౌట్ అవడంతో లక్నో 28 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఆ జట్టు తరఫున మహిపాల్ లోమ్రర్ (13 బంతుల్లో 33, 3 ఫోర్లు, 3 సిక్సర్లు) టాప్ స్కోరర్. 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' మయాంక్ యాదవ్ (3/14) నాలుగు ఓవర్లు వేసి 14 పరుగులే ఇచ్చి మూడు వికెట్లు పడగొట్టి ఆర్సీబీ పతనాన్ని శాసించాడు.

**డికాక్‌తో మొదలై..**

టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన లక్నోకు ఓపెనర్లు శుభారంభమిచ్చారు. కేఎల్ రాహుల్ (20) నెమ్మదిగా ఆడినా క్వింటన్ డికాక్ ఆరంభం నుంచే బెంగళూరు బౌలర్లపై విరుచుకుపడ్డాడు. రీస్ టాప్లీ వేసిన మొదటి ఓవర్లోనే మూడు ఫోర్లు బాదిన అతడు.. సిరాజ్ వేసిన మూడో ఓవర్లో రెండు సిక్సర్లతో జోరు కొనసాగించాడు. రాహుల్.. మ్యాక్స్‌వెల్ బౌలింగ్‌లో మయాంక్ దాగర్ చేతికి చిక్కగా పడిక్కల్ (6) మరోసారి నిరాశపరిచాడు. స్టొయినిస్ (15 బంతుల్లో 24, 1 ఫోర్, 2 సిక్సర్లు) ఉన్నంతసేపు మెరుపులు మెరిపించాడు. 36 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తిచేసుకున్న డికాక్.. టాప్లీ బౌలింగ్‌లో దాగర్‌కు క్యాచ్ ఇచ్చాడు.

**పూరన్‌తో ముగించి..**

18 ఓవర్లు ముగిసేటప్పటికీ లక్నో స్కోరు 148-5. చివరి 12 బంతుల్లో లక్నో 33 పరుగులు సాధించిందంటే దానికి కారణం పూరన్. టాప్లీ వేసిన 19వ ఓవర్లో పూరన్.. హ్యాట్రిక్ సిక్సర్లతో 20 పరుగులు రాబట్టగా సిరాజ్ ఆఖరి ఓవర్లోనూ రెండు సిక్సర్లు బాదడంతో లక్నో పోరాడగలిగే లక్ష్యాన్ని నిలపగలిగింది.

**మయాంక్ మెరుపులా..**

ఎప్పుడెలా ఆడుతుందో తెలియని బెంగళూరు.. సొంత మైదానంలో మరోసారి నిరాశపరిచింది. ఆరంభం నుంచే స్పిన్నర్లతో దాడిని ప్రారంభించిన లక్నో.. ఆర్సీబీని తమ వ్యూహంలో బంధించింది. 16 బంతుల్లో 22 పరుగులు చేసిన కోహ్లీ.. తమిళనాడుకు చెందిన యువ స్పిన్నర్ ఎం. సిద్ధార్థ్ వేసిన ఐదో ఓవర్లో రెండో బంతికి బ్యాక్‌వర్డ్ పాయింట్ వద్ద పడిక్కల్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. సిద్ధార్థ్‌కు ఐపీఎల్‌లో ఇదే తొలి వికెట్. ఇక నయా పేస్ సంచలనం మయాంక్ యాదవ్ రాకతో ఆర్సీబీ కోలుకోలేదు. ఏడో ఓవర్ వేసిన అతడి బౌలింగ్‌లో మొదటి బంతికే డుప్లెసిస్ పరుగు తీయబోయి పడిక్కల్ డైరెక్ట్ త్రో తో రనౌట్ అయ్యాడు. అదే ఓవర్లో నాలుగో బంతిని మయాంక్.. 151 కిలోమీటర్ల వేగంతో విసిరిన షార్ట్ లెంగ్త్ డెలివరీని ఆడబోయిన డేంజరస్ మ్యాక్స్‌వెల్ (0) మిడాన్ వద్ద పూరన్ క్యాచ్ పట్టడంతో అతడి కథ ముగిసింది. మయాంక్ తన మరుసటి ఓవర్లో కామెరూన్ గ్రీన్ (9)నూ క్లీన్ బౌల్డ్ చేసి ఆర్సీబీని కోలుకోనీయకుండా చేశాడు.

ఆర్సీబీ వికెట్ల పతనాన్ని ఐదు ఓవర్ల పాటు అడ్డుకున్న అనూజ్ రావత్ (11)ను స్టొయినిస్ ఔట్ చేశాడు. 21 బంతుల్లో 29 పరుగులు చేసిన పాటిదార్ కూడా మయాంక్ మాయకే దాసోహమయ్యాడు. ఆర్సీబీ విజయానికి 5 ఓవర్లలో 78 పరుగులు అవసరమవగా.. 49 పరుగులు చేసి మిగిలిన 4 వికెట్లూ కోల్పోయింది.

**సంక్షిప్త స్కోర్లు**

లక్నో: 20 ఓవర్లలో 181/5 (డికాక్ 81, పూరన్ 40 నాటౌట్, మ్యాక్స్‌వెల్ 2/23, యశ్ దయాళ్ 1/24) బెంగళూరు: 19.4 ఓవర్లలో 153 (లోమ్రర్ 33, పాటిదార్ 29, మయాంక్ 3/14, సిద్ధార్థ్ 1/21)

**పాయింట్ల పట్టిక**

| జ | ఆ | గె | ఓ | ర | పా |
|---|---|---|---|---|---|
| రాజస్థాన్ | 3 | 3 | 0 | 1.24 | 6 |
| కోల్‌కతా | 2 | 2 | 0 | 1.04 | 4 |
| చెన్నై | 3 | 2 | 1 | 0.97 | 4 |
| లక్నో | 3 | 2 | 1 | 0.48 | 4 |
| గుజరాత్ | 3 | 2 | 1 | -0.73 | 4 |
| హైదరాబాద్ | 3 | 1 | 2 | 0.20 | 2 |
| ఢిల్లీ | 3 | 1 | 2 | -0.01 | 2 |
| పంజాబ్ | 3 | 1 | 2 | -0.33 | 2 |
| బెంగళూరు | 4 | 1 | 3 | -0.87 | 2 |
| ముంబై | 3 | 0 | 3 | -1.42 | 0 |

నోట్: జ:జట్లు, ఆ: ఆడినవి, గె: గెలిచినవి, ఓ: ఓడినవి, ర:రన్‌రేట్, పా:పాయింట్లు

## ఐపీఎల్ మ్యాచ్‌లు రీషెడ్యూల్

ముంబై : ఐపీఎల్-17లో రెండు మ్యాచ్‌లను బీసీసీఐ రీషెడ్యూల్ చేసింది. ఈనెల 17న ఈడెన్ గార్డెన్ వేదికగా జరగాల్సి ఉన్న కోల్‌కతా-రాజస్థాన్ మ్యాచ్‌ను ఒక రోజు (ఏప్రిల్ 16) ముందే నిర్వహించనున్నారు. శ్రీరామ నవమితో పాటు సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో భద్రతా కారణాల దృష్ట్యా ఈ మ్యాచ్‌ను రీషెడ్యూల్ చేశారు. మరోవైపు అహ్మదాబాద్ వేదికగా గుజరాత్-ఢిల్లీ మధ్య ఏప్రిల్ 16న జరగాల్సిన మ్యాచ్‌ను మరుసటి రోజు(ఏప్రిల్ 17)న నిర్వహించనున్నట్టు బీసీసీఐ ఒక ప్రకటనలో పేర్కొంది.



## బింద్యారాణికి కాంస్యం

పుకెట్(థాయ్‌లాండ్): ప్రతిష్ఠాత్మక ఐడబ్ల్యూఎఫ్ వెయిట్‌లిఫ్టింగ్ ప్రపంచ కప్‌లో భారత లిఫ్టర్ బింద్యారాణి దేవి కాంస్య పతకంతో మెరిసింది. మంగళవారం జరిగిన మహిళల 55కిలోల విభాగంలో బరిలోకి దిగిన బింద్యారాణి(83కి+113కి) మొత్తం 196కిలోలు ఎత్తి మూడో స్థానంలో నిలిచింది. ఇదే విభాగంలో పోటీపడ్డ కాంగ్ హ్యాన్ (234కి), కాంబీ మిహిల (201కి) వరుసగా స్వర్ణ, రజత పతకాలు కైవసం చేసుకున్నారు. నాన్ ఒలింపిక్ వెయిట్ కేటగిరీలో బరిలోకి దిగిన బింద్యారాణి.. కామన్వెల్త్‌గేమ్స్ ప్రదర్శన(203కి)ను పునరావృతం చేయలేకపోయింది.

## విజయానికి చేరువలో లంక

ఛటోగ్రామ్: బంగ్లాదేశ్‌తో ఛటోగ్రామ్ వేదికగా జరుగుతున్న రెండో టెస్టులో శ్రీలంక విజయానికి 3 వికెట్ల దూరంలో నిలిచింది. 511 పరుగుల భారీ ఛేదనలో భాగంగా రెండో ఇన్నింగ్స్ ఆడుతున్న బంగ్లాదేశ్ నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి 67 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 268 పరుగులు చేసింది. ఐదో రోజు ఆ జట్టు గెలవాలంటే మరో 243 పరుగులు చేయాల్సి ఉంది. మెహదీ హసన్ మిరాజ్ (44 నాటౌట్), తైజుల్ ఇస్లాం (10 నాటౌట్) క్రీజులో ఉన్నారు.

వాణిజ్య



ప్రభుత్వరంగ సంస్థ కెనరా బ్యాంక్ పలు నూతన ఉత్పత్తులను విడుదల చేసింది. కెనరా హీల్, కెనరా ఏంజెల్, కెనరా రెడీక్యాష్, కెనరామైమనీ వంటి నూతన సేవల విడుదల కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రిజర్వుబ్యాంక్ ఇన్నోవేషన్ హబ్ సీఈవో రాజేశ్ బన్సల్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కెనరా బ్యాంక్ ఎండీ, సీఈవో కే సత్యనారాయణ రాజు, బ్యాంక్ ఈడీలు దేబాశిష్ ముఖర్జీ, అశోక్ చంద్ర, హర్దీప్ సింగ్ అహ్లువాలియా, భావేంద్ర కుమార్ పాల్గొన్నారు. హెల్త్‌కేర్‌కు సంబంధించినది కెనరా హీల్ ప్రొడక్ట్ కాగా, మహిళల కోసం కెనరా ఏంజిల్, వ్యక్తిగత రుణాల ముందస్తు అనుమతికోసం కెనరా రెడీక్యాష్ పథకం.

# ఈసారీ వడ్డీరేట్లు ఎక్కడివక్కడే?

### నేటి నుంచి ఆర్బీఐ తొలి ద్వైమాసిక ద్రవ్యసమీక్ష



ముంబై, ఏప్రిల్ 2: ఈ ఆర్థిక సంవత్సరం (2024-25) తొలి ద్వైమాసిక ద్రవ్యపరపతి విధాన సమీక్షను బుధవారం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) ప్రారంభిస్తున్నది. మూడు రోజులపాటు జరిగే ఈ సమావేశం నిర్ణయాలు శుక్రవారం వెలువడనున్నాయి. కాగా, ఈసారీ కీలక వడ్డీరేట్ల జోలికి వెళ్లకుండానే ఆర్బీఐ తమ ద్రవ్య విధానాన్ని ప్రకటించవచ్చన్న అంచనాలు గట్టిగా వినిపిస్తున్నాయి. కరోనా సమయంలో దిగాలు పడిన దేశ ఆర్థిక వ్యవస్థను ఉత్తేజపర్చేందుకు ఆర్బీఐ రెపోరేటును భారీగా తగ్గించిన విషయం తెలిసిందే. అయితే కోవిడ్ ప్రభావం తగ్గుముఖం పట్టడంతో ద్రవ్యోల్బణం అదుపే లక్ష్యంగా రెపోరేటును పెంచుకుంటూ పోయింది. ఫలితంగా ఇప్పుడిది 6.5 శాతంగా ఉన్నది. నిజానికి నిరుడు మే నెల నుంచి ఇది ఇలాగే ఉంటున్నది. ఈ క్రమంలో ఈసారి ద్రవ్య సమీక్షలోనూ ఈ రేటు ఇక్కడే ఉంటుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ద్రవ్యోల్బణం ఇంకా ఆర్బీఐ ఆమోదయోగ్య స్థాయిలోకి దిగి రాకపోవడం, ఫెడ్ రిజర్వ్ వడ్డీరేట్ల విధానం వంటివి ఇందుకు కారణంగా విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఇదిలావుంటే గతంలో మూడు నెలలకోసారి నిర్వహించిన ద్రవ్య సమీక్షను.. ఇప్పుడు రెండు నెలలకే చేపడుతున్నారు. దీంతో ప్రతీ ఆర్థిక సంవత్సరంలో 6 సమీక్షలు జరుగుతున్నాయి. సాధారణంగా ఏప్రిల్, జూన్, ఆగస్టు, అక్టోబర్, డిసెంబర్, ఫిబ్రవరి నెలల్లో ఇవి ఉంటాయి. వడ్డీరేట్లు, నగదు చలామణి, ద్రవ్యోల్బణం, ఇతర స్థూల ఆర్థికాంశాలపై ఈ సమావేశాల్లో ఆర్బీఐ గవర్నర్ నేతృత్వంలోని ఆరుగురు సభ్యుల కమిటీ చర్చిస్తుంది. మెజారిటీ సభ్యుల అంగీకారంతో నిర్ణయాలు వెలువడుతాయి.

# సరికొత్తగా కియా కారెన్స్




న్యూఢిల్లీ, ఏప్రిల్ 2: ప్రీమియం కార్ల విక్రయాల్లో అగ్రగామి సంస్థల్లో ఒకటైన కియా..2024 ఏడాదికిగాను మరో మాడల్‌ను అప్‌గ్రేడ్ చేసి మళ్లీ మార్కెట్లోకి విడుదల చేసింది. ఆరు-ఏడు సీట్ల సామర్థ్యంతో రూపొందించిన కారెన్స్ ప్రారంభ ధర రూ.12,11,900గా నిర్ణయించింది. అలాగే 1.5 డీజిల్ ఎంటీ కారెన్స్ ధర రూ.12,66,900గా నిర్ణయించింది. పాత మాడల్‌తో పోలిస్తే కొత్తది 30 వరకు అదనపు ఫీచర్స్‌తో రూపొందించింది. స్మార్ట్ కీ, పుష్ బటన్ స్టార్ట్, రియర్ ఎల్‌ఈడీ లైట్స్, ఆరు-స్పీడ్ గేర్లు, 1.5 డీజిల్ ట్రాన్స్‌మిషన్ ఫీచర్స్‌తో తయారు చేసింది. ఇప్పటి వరకు 1.5 లక్షల వాహనాలు అమ్ముడయ్యాయి.

# కేడీసీసీ లాభం 100 కోట్లు

### నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు



కరీంనగర్ విద్యానగర్, ఏప్రిల్ 2 : కరీంనగర్ జిల్లా సహకార కేంద్ర బ్యాంక్(కేడీసీసీ) రికార్డు స్థాయి లాభాలను గడించింది. 2023-24 ఆర్థిక సంవత్సరానికిగాను బ్యాంక్ రూ.100.10 కోట్ల లాభాన్ని ఆర్జించినట్లు కేడీసీసీ బ్యాంకు చైర్మన్, నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్ రావు ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే బ్యాంక్ డిపాజిట్లు రూ.2,282.62 కోట్ల నుంచి రూ.2,528.90 కోట్లకు పెరిగాయన్నారు. అలాగే అడ్వాన్స్‌లు రూ.3,242.38 కోట్ల నుంచి రూ.3,973.34 కోట్లకు చేరుకున్నట్లు ఆయన వెల్లడించారు. బ్యాంక్ మొత్తం వ్యాపారం 15.57 శాతం వృద్ధితో రూ.6,501.24 కోట్లుగా నమోదైందన్నారు. బ్యాంక్ సీఈవో సత్యనారాయణరావు అధ్వర్యంలో బ్యాంక్ అన్ని రంగాల్లో దూసుకుపోతున్నదని, ఈ రికార్డు స్థాయి లాభాలను ఆర్జించడంతో బ్యాంకు సిబ్బందిని ఆయన అభినందించారు. ఎస్బీఐ, యూబీఐ తర్వాత జిల్లాలో మూడో అతిపెద్ద బ్యాంకుగా ఎదుగుతున్నదని, నాబార్డు అందించిన మద్దతుతోపాటు బ్యాంకు పాలకవర్గ సభ్యుల మద్దతుతోనే ఇది సాధ్యమైందన్నారు.

# తెలుగు రాష్ట్రాల్లో జియో జోరు




హైదరాబాద్, ఏప్రిల్ 2: దేశీయ టెలికం దిగ్గజం రిలయన్స్ జియో..వినియోగదారులను ఆకట్టుకోవడంలో దూసుకుపోతున్నది. ఈ ఏడాది జనవరి నెలలో తెలుగు రాష్ర్టాల్లో సంస్థ 2.59 లక్షల మంది కస్టమర్లు చేరారు. ఈ విషయం టెలికం నియంత్రణ మండలి ట్రాయ్ తాజాగా వెల్లడించింది. దీంతో జియో వినియోగదారుల సంఖ్య 3.24 కోట్లకు చేరుకున్నారు. మరోవైపు, ఎయిర్‌టెల్ కొత్తగా 1.18 లక్షల మంది మొబైల్ సబ్‌స్క్రైబర్లు చేరారు. కానీ, వొడాఫోన్ ఐడియా నుంచి 44,649, బీఎస్‌ఎన్‌ఎల్ నుంచి 16,146 మంది వినియోగదారులను కోల్పోయారు. అలాగే దేశవ్యాప్తంగా అత్యధికంగా 41.78 లక్షల మంది జతకావడంతో మొత్తం కస్టమర్ల సంఖ్య 52.67 కోట్లకు చేరుకున్నారు.

## అసోచామ్ ప్రెసిడెంట్‌గా సంజయ్



న్యూఢిల్లీ, ఏప్రిల్ 2: సోరిన్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ చైర్మన్ సంజయ్ నాయర్.. 2024-25 ఆర్థిక సంవత్సరానికిగాను అసోచామ్ ప్రెసిడెంట్‌గా నియమితులయ్యారు. స్పైస్‌జెట్ చైర్మన్, ఎండీ అజయ్ సింగ్ పదవీకాలం ముగియడంతో ఈ స్థానాన్ని నాయర్ భర్తీ చేయనున్నారు. అంతర్జాతీయ ఆర్థిక సేవ లు, క్యాపిటల్ మార్కెట్లో నాలుగు దశాబ్దాలకు పైగా అనుభవం ఉన్న నాయర్..సిటీలో 25 ఏండ్లు, కేకేఆర్‌లో 14 ఏండ్లు పనిచేశారు.

# మరో 50 విస్తారా సర్వీసులు రద్దు

### రోజువారీ నివేదికివ్వాలని డీజీసీఏ ఆదేశం
### రాజీనామా చేస్తున్న పైలట్లు

న్యూఢిల్లీ/ముంబై, ఏప్రిల్ 2: విస్తారాపై ఏవియేషన్ రెగ్యులేటర్ డీజీసీఏ సీరియస్‌గా దృష్టి సారించింది. ఈ టాటా గ్రూప్‌నకు చెందిన విమానయాన సంస్థ.. వరుసగా రెండోరోజూ విమాన సర్వీసులను రద్దు చేసింది. పైలట్లు అందుబాటులో లేకపోవడం కారణంగా చూపుతూ మంగళవారం ఏకంగా 50కిపైగా ఫ్లైట్లను క్యాన్సిల్ చేసింది. ఈ క్రమంలో విమాన సర్వీసుల జాప్యం, రద్దుకు సంబంధించిన సమాచారం, ఇతరత్రా వివరాలపై రోజువారీ నివేదికను సమర్పించాలని విస్తారాను డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) ఆదేశించింది. అలాగే విమానాల ఆలస్యం, రద్దు నేపథ్యంలో ప్రయాణీకులకు కావాల్సిన సౌకర్యాలను విస్తారా అందిస్తున్నదా? ప్యాసింజర్లు ఏమైనా ఇబ్బందులను ఎదుర్కొంటున్నారా? అన్నదాన్నీ డీజీసీఏ పరిశీలిస్తున్నది. మరోవైపు చాలామంది ప్రయాణీకులు సోషల్ మీడియాలో తాము ఎదుర్కొంటున్న అసౌకర్యంపై పోస్టులు పెడుతున్నారు. దీంతో కేంద్ర పౌర విమానయాన మంత్రిత్వ శాఖ సైతం ఈ వ్యవహారాన్ని పరిశీలిస్తున్నది. అసలు ఏం జరుగుతున్నదన్నది ఆరా తీస్తున్నది. ఇటీవలే 15 మంది పైలట్లు విస్తారాకు రాజీనామా చేసిన నేపథ్యంలో ఇలా జరుగుతుండటం గమనార్హం. విస్తారాలో దాదాపు 800 మంది పైలట్లున్నారు. వేసవి నేపథ్యంలో రోజూ 300లకుపైగా విమానాలను నడుపుతున్నది. ఇందులో 70కిపైగా ఏ320, బోయింగ్ 787 విమానాలున్నాయి. కాగా, ఎయిరిండియాలో విలీనం దిశగా అడుగులు వేస్తున్న విస్తారా.. ఉద్యోగులతో కొత్త ఒప్పందాలను చేసుకుంటున్నది. అయితే జీతాల విషయంలో జరుగుతున్న అన్యాయాన్ని సహించక సీనియర్ ఆఫీసర్లు ముఖ్యంగా పైలట్లు నిరసన వ్యక్తం చేస్తున్నారు. పైలట్లు విధుల నుంచి తప్పుకుంటుండటంతో ఏ320 సర్వీసులు నిలిచిపోయాయి.

# ఈ 13 షేర్లు అదుర్స్

### గత ఆర్థిక సంవత్సరం మదుపరులకు 104-325% రాబడులు



ముంబై, ఏప్రిల్ 2: గత నెలాఖరుతో ముగిసిన గడిచిన ఆర్థిక సంవత్సరం (2023-24)లో దేశీయ స్టాక్ మార్కెట్లలోకి భారీగానే ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్లు (ఐపీవో) వచ్చాయి. అయితే ఇందులో కొన్ని ఆకర్షణీయ స్థాయిలో మదుపరులకు రాబడులను అందించాయి. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే మొత్తం 78 ఐపీవోల్లో గత ఆర్థిక సంవత్సరం 100 శాతానికి పైగా లాభాలను 13 ఇచ్చాయి. వీటిలో ఇండియన్ రెన్యువబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ ఏజెన్సీ లిమిటెడ్ (ఐఆర్‌ఈడీఏ) గరిష్ఠంగా 325 శాతం లాభాలను ఇన్వెస్టర్లకు పంచింది. 104.1 శాతంతో టాటా టెక్నాలజీస్ దిగువన నిలిచింది.

**ఎల్ఐసీ తర్వాత..**

ప్రభుత్వ రంగ బీమా దిగ్గజం లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసీ) కంపెనీ తర్వాత దేశీయ స్టాక్ మార్కెట్లలోకి వచ్చిన ప్రభుత్వ రంగ సంస్థ ఐఆర్‌ఈడీఏనే. నిరుడు నవంబర్ 29న రూ.32 వద్ద ఈ సంస్థ షేర్లు మార్కెట్లలో నమోదయ్యాయి. గత ఆర్థిక సంవత్సరానికిగాను ట్రేడింగ్ చివరి రోజైన మార్చి 28న రూ.135.9 వద్ద ముగిసింది. దీంతో 324.7 శాతం రిటర్న్స్ వచ్చాయి. ఐఆర్‌ఈడీఏ పబ్లిక్ ఇష్యూ పరిమాణం రూ.2,150.21 కోట్లుగా ఉన్న విషయం తెలిసిందే.

**నష్టాల్లో స్టాక్ మార్కెట్లు**

వరుస 3 రోజుల లాభాలకు బ్రేక్ పడింది. మంగళవారం బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 110.64 పాయింట్లు లేదా 0.15 శాతం క్షీణించి 73,903.91 వద్ద ముగిసింది. ఒకానొక దశలో 270.78 పాయింట్లు పతనం కావడం గమనార్హం. అయితే ఎన్ఎస్ఈ సూచీ నిఫ్టీ స్వల్పంగా 8.70 పాయింట్లు లేదా 0.04 శాతం తగ్గి 22,453.30 వద్ద స్థిరపడింది. ఐటీ, ప్రైవేట్ బ్యాంక్, ఆటో రంగాల షేర్లలో మదుపరులు లాభాల స్వీకరణకు దిగడమే సెన్సెక్స్ నష్టాలకు కారణం. అమెరికా మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలు, విదేశీ సంస్థాగత మదుపరుల పెట్టుబడుల ఉపసంహరణ కూడా అమ్మకాల ఒత్తిడికి దారితీసిందన్న విశ్లేషణలున్నాయి. కాగా, సోమవారం ట్రేడింగ్‌లో అటు సెన్సెక్స్, ఇటు నిఫ్టీ రెండూ ఆల్‌టైమ్ హైని తాకిన సంగతి విదితమే. అయితే మదుపరుల లాభాల స్వీకరణతో ఆ రికార్డు ఆఖరుదాకా నిలవలేకపోయింది. ఇదిలావుంటే టెక్నాలజీ, ఐటీ, టెలికం, బ్యాంకింగ్ సూచీలు 0.71 శాతం నుంచి 0.19 శాతం వరకు కోల్పోయాయి. కొటక్ మహీంద్రా, ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఇన్ఫోసిస్, టీసీఎస్, విప్రో, టెక్ మహీంద్రా, ఎల్ అండ్‌టీ షేర్లు భారీగా నష్టపోయాయి.

**2023-24లో దేశీయ స్టాక్ మార్కెట్లలో నమోదై ఆకర్షణీయ లాభాలను అందించిన షేర్లు**

| షేర్ | లిస్టింగ్ తేదీ | ఇష్యూ ధర | మార్చి 28న ధర | లాభం |
|---|---|---|---|---|
| ఐఆర్‌ఈడీఏ | 29-11-2023 | రూ.32 | రూ.135.9 | 324.7% |
| సిగ్నేచర్‌గ్లోబల్ | 27-09-2023 | రూ.385 | రూ.1,359.2 | 253.0% |
| నెట్‌వెబ్ టెక్నాలజీస్ | 27-07-2023 | రూ.500 | రూ.1,607.7 | 221.5% |
| మోతీసన్స్ జ్యుయెల్లర్స్ | 26-12-2023 | రూ.55 | రూ.160.1 | 191.0% |
| సైయెంట్ డీఎల్‌ఎం | 10-07-2023 | రూ.265 | రూ.720.4 | 171.8% |
| ఆజాద్ ఇంజినీరింగ్ | 28-12-2023 | రూ.524 | రూ.1,367.8 | 161.0% |
| సెన్కో గోల్డ్ | 14-07-2023 | రూ.317 | రూ.771.6 | 143.4% |
| మ్యాన్‌కైండ్ ఫార్మా | 09-05-2023 | రూ.1,080 | రూ.2,300.8 | 113.0% |
| జేఎస్‌డబ్ల్యూ ఇన్‌ఫ్రా | 03-10-2023 | రూ.119 | రూ.245.3 | 106.2% |
| కాంకర్డ్ బయోటెక్ | 18-08-2023 | రూ.741 | రూ.1,520.8 | 105.2% |
| టాటా టెక్నాలజీస్ | 30-11-2023 | రూ.500 | రూ.1,020.6 | 104.1% |
| జ్యోతి సీఎన్‌సీ ఆటోమేషన్ | 16-01-2024 | రూ.331 | రూ.821.5 | 148.2% |
| బీఎల్ఎస్ ఈ-సర్వీసెస్ | 06-02-2024 | రూ.135 | రూ.310 | 129.6% |

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.